క్లుప్తంగా

సాయినాథుడికి పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పూజలు, మంగళహారతిలో పాల్గొన్నారు. సాయంత్రం పల్లకీసేవా, భజనకీర్తనలతో పలు కార్యక్రమాలు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మల్లంకుంట ఎఫ్‌టీఎల్ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను వెంటనే కూల్చివేయాలని బీజేపీ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కుంట మొత్తం వ్యర్థాలతో నిండిపోయిందని, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సతీష్, రేణయ్య, బాలాజి, రవీందర్, జగదీశ్వర్‌గౌడ్, పత్యానాయక్, దేవేందర్‌రెడ్డి, అంజి, అమర్ పాల్గొన్నారు.

కుటుంబసభ్యుడిని కోల్పోయాం



పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బీరం రాజారెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. గ్రామ అభివృద్ధి ఎంతో కృషి చేసిన రాజారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. అంతిమయాత్రలో పాడె మోశారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

తాడూరు: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని అల్లాపూర్ సర్పంచ్ నిరంజన్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించి నాణ్యమైన భోజనాన్ని పెడతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం కట్ట శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10న లోక్ అదాలత్

కోడేరు: కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని ఈనెల 10న నేషనల్ లోక్ అదాలత్ ఉంటుందని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. రాజీ చేసుకున్న ఇరువర్గాల వారు ఈనెల 6 నుంచి 10వరకు సంబంధిత పోలీసుస్టేషన్‌లో హాజరు కావాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



కందనూలు: కేంద్ర ప్రభుత్వం రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించినందుకు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రోడ్డుపై అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యూరియాకు రూ.70 వేల కోట్లు, డీఏపీకి రూ.38 వేల కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. అంతకు ముందు జిల్లా కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, లోహిత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కంకర



అచ్చంపేట రూరల్: పట్టణంలోని 13వ వార్డులోని శ్రీరాంనగర్ కాలనీ వ్యవసాయ మార్కెట్ ప్రహరీగోడ నుంచి ఉప్పునుంతల రోడ్డుకు వెళ్లే దారిలో కొన్ని రోజుల క్రితం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కారణాలు ఏమో తెలియదు కానీ అర్ధాంతరంగా పనులు ఆగాయి. రోడ్డుకు అడ్డంగా వేసిన కంకర అలాగే ఉంది. దీంతో అటుగా వెళ్లే బాటసారులు, వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. చాలా రోజులుగా అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఊరూరా చెరువు పండుగ



వటువర్లపల్లి చెరువు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు



పెద్దకార్పాముల చెరువు వద్ద బోనాలతో మహిళలు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో ఊర చెరువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు కట్టలపై వెలసిన మైసమ్మ దేవతలకు బోనం తీసి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ తల్లికి తెప్పోత్సవం నిర్వహించి పూజలు కొనసాగించారు. మండలంలో తూడుకుర్తి సత్యసముద్రం చెరువులో నిర్వహించిన పూజలలో డీఆర్‌డీఓ నర్సింగరావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మిషన్‌కాకతీయ పథకంలో చెరువులను బాగు చేయడం వల్ల నిండుకుండలా వేసవిలోనూ కళకళలాడుతున్నాయని తెలిపారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ కోటేశ్వర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్రాబాద్, పదర మండలాల్లోని అన్ని గ్రామాల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. చెరువుల వద్ద వనభోజనాలు చేసి బతుకమ్మలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓలు రామ్మోహన్, శంకర్‌నాయక్, తహసీల్దార్లు రాజేందర్‌రెడ్డి, తబితారాణి, ఎంపీహెచ్‌ఈఓ వెంకటయ్య, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మన్ననూర్: మన్ననూర్‌లోని దుర్వాసుల చెరువులో సర్పంచ్ నేనావత్ శ్రీరాం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి చెరువులో పూలు, పసుపు, కుంకుమలు చల్లారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, కార్యదర్శి భీముడు, కృష్ణ పాల్గొన్నారు. వటువర్లపల్లిలో అధికారులు లేకుండానే గ్రామస్తులతో కలిసి గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించామని సర్పంచ్ చత్రునాయక్ తెలిపారు.

పెద్దకొత్తపల్లి: మండలంలో చెరువుల పండుగ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి చెరువు వద్ద పూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేసినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు.



అంతారంలో బోనాలతో ఊరేగింపు

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్, మంచాలకట్టలో సర్పంచ్‌లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బతుకమ్మను తయారు చేసి ఆటపాటలతో బొడ్డెమ్మలు వేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని చెరువుల వద్ద గురువారం ఊరూరా చెరువు పండుగలను ఘనంగా నిర్వహించారు.

తాడూరు: మండలంలోని అంతారంలో సర్పంచ్ జయమ్మ, సాగునీటి సంఘాల నాయకులు, గుంతకోడూరులో సర్పంచ్ మాధవి, మత్స్యకార సంఘం నాయకులు తదితరులు పాల్గొని చెరువుకట్టలపైన ఉన్న దేవతలకు పూజలు చేసి బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపు, ర్యాలీలు చేపట్టారు.

బల్మూర్: మండలంలోని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి పంచాయతీల నుంచి డప్పులతో ర్యాలీలుగా చెరువుల వద్దకు చేరుకుని గంగాహారతి ఇచ్చి పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, తహసీల్దార్ కిష్ట్యానాయక్, శివశంకర్, ఎంపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని ఆయా గ్రామాలలో ఊరూర చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు జూపల్లి, తిమ్మాయిపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, సిర్సనగండ్లలో గురువారం చెరువు గట్లపై పండుగ వాతావరణం నెలకొంది. కట్టమైసమ్మకు, చెరువు నీటికి పూజలు చేశారు. అనంతరం మత్స్యకారులు, వలలతో, మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా చెరువుకట్ట వద్ద చేరుకుని భోజనాలు చేశారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు నార్యనాయక్ తండా, మైలారం, ఎత్తంలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం పార్వతమ్మ ఆధ్వర్యంలో బతుకమ్మలను చేసి పంచాయతీ వద్ద ఆటలు ఆడుతూ ఊరేగింపు నిర్వహించి ఊరు చెరువు వద్ద నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, కార్యదర్శి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



తాడూరులో చెరువుకట్టపై బతుకమ్మ వేస్తున్న మహిళలు



తూడుకుర్తిలో పూజలు చేస్తున్న గ్రామస్తులు, అధికారులు



బల్మూర్ చెరువు వద్ద పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జూపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



నార్యనాయక్ తండాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



లింగాల మండలం మగ్దూంపూర్ ఊరకుంట వద్ద..

గ్రామాల్లో పచ్చటి వాతావరణం



గౌరారంలో బోనాల ఊరేగింపులో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

తెలకపల్లి: ఏళ్ల తరబడి కరువుతో అల్లాడిన రాష్ట్రం ఇప్పుడు చెరువులు, కుంటలలో నీళ్లు నిండుగా ఉన్నాయని పచ్చని పంటలతో గ్రామాలన్నీ సస్యశ్యామలం అయ్యాయని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌరారంలో ఎమ్మెల్సీ సంబరాలలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చెరువులు నిండి నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. ఉమ్మడి పాలమూరుతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కరువుతో అల్లాడిందని రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్ట్‌లు, కాల్వల ద్వారా నీటిని అందించారన్నారు. పూర్వ వైభవం గ్రామాలలో సంతరించుకుందని రైతులు తమ పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. వలసలు తగ్గాయని తెలిపారు. మహిళలు బతుకమ్మలతో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధు, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ వెంకటయ్య, జమ్ములు, అధికారులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం ద్వారా పక్కా ఇళ్లు

ఉప్పునుంతల: ఉండటానికి ఇళ్లు సరిగా లేని పేదవారికి గృహలక్ష్మి పథకం ద్వారా పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తానని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని మామిళ్లపల్లిలో ఇటీవల గాలివానలకు ఇంటి పైకప్పు రేకులు దెబ్బతిన్న కుటుంబాలను గురువారం పరామర్శించారు. వారి ఇళ్ల పరిస్థితులను పరిశీలించారు. బాధితులు సాలయ్య, శంకర్, సత్యం కుటుంబాలకు తన వంతుగా ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

చెరువులకు పూర్వ వైభవం ఘనత కేసీఆర్‌దే



వెల్దండలో బతుకమ్మతో వెళ్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: చెరువుల పునరుద్ధరణ చేసి పూర్వ వైభవం తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఊరూర చెరువుల పండుగా ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మలతో చెరువుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మత్స్యకారులతో చేపలవేట చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుని రైతులకు, ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలమూరు జిల్లా ప్రజలు వలసలు వెళ్లి అనేక ఇబ్బందులు పడేవారన్నారు. సాగునీరు ప్రాజెక్టులతో ఇతర రాష్ట్రాల నుంచి పాలమూరుకే వలసలు వస్తున్నారని అన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అదేవిధంగా బైరాపూర్, చెర్కూర్, కంటోనిపల్లి, కేస్లీతండా చెరువుల వద్ద పండుగ వాతావరణం కన్పించింది. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, దార్లకుమార్, రేవతి, రామకృష్ణ, బుజ్జి, ఇరిగేషన్ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ మంజుల, ఏఈ తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుకు మోక్షమెప్పుడో?

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి తాడూరు వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు కమ్ముకోవడంతోపాటు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో పూర్తిగా బీటీ దెబ్బతింది. మూల మలుపుల వద్ద చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గంలోనే పెనిమిళ్ల వరకు ఎక్కువ గ్రామాలకు వెళ్లడానికి అనువుగా ఉంది. ఐదేళ్ల క్రితం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి తిరిగి పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దెబ్బతిన్న తాడూరు- ఉప్పునుంతల రోడ్డు

పెండింగ్‌లో గోకారం రిజర్వాయర్



తొలగించిన పాత చెరువు కట్ట

- ఆరేళ్లయినా ప్రారంభం కాని పనులు
- పాత చెరువు తొలగించడంతో 15 గ్రామాల తిప్పలు

చారకొండ: మండలంలోని గోకారం చెరువులో నీరుంటే చుట్టు పక్కన ఉన్న 15 గ్రామాలు పచ్చని పంటలతో కళకళలాడేవి. చెరువులో చేపల పెంపకంతో మత్స్యకారుల కుటుంబాలకు చేతినిండా పని దొరికేది. రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి దశాబ్దాల కాలం నాటి పాత చెరువు తొలగించారు. రిజర్వాయర్‌తో తమ జీవితాలు మరింత మెరుగుపడతాయని ఆనందించిన ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. ఆరేళ్లయినా పనులు చేపట్టలేదు. చెరువులో నీరు లేక, ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. గోకారం చెరువు 300ఎకరాలకు పైగా విస్తీర్ణంతో ఉండగా భారీగా నీరు నిలిచేది. ఈ చెరువే మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం, సిర్సనగండ్ల, రాంపురం, మర్రిపల్లి, శాంతిగూడెం, ఎర్రవల్లి, శేరి అప్పారెడ్డిపల్లి, అగ్రహారం తండా, జూపల్లి, తుర్కలపల్లి, వెల్దండ మండలంలోని గ్రామాలు, పరిసర ఉన్న నల్లగొండ జిల్లా గ్రామాల రైతులకు ఆధారం. దాదాపు వెయ్యి ఎకరాల ఆయకట్టులో రైతులు ఏటా రెండు పంటలు సాగు చేసేవారు. రిజర్వాయర్ పేరుతో పాత చెరువు తొలగించడంతో సాగునీరు లేక ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారాయి. బోర్లు, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగు విస్తీర్ణం మరింత తగ్గింది. దాంతో రైతులు మెట్టపంటలు సాగుచేస్తున్నారు.



తవ్విన కాల్వ

నిధులు కేటాయించని ప్రభుత్వం

ఆరేళ్ల క్రితం డిండి-నార్లపూర్ ప్రాజెక్టు కింద గోకారం చెరువును రిజర్వాయర్‌గా మార్చి నీటి సమస్యలు లేకుండా చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అధికారులు రైతుల నుండి 1,682 ఎకరాలను సేకరించారు. ఇప్పటి వరకు పెద్ద మొత్తంలో రైతులకు పరిహారం చెల్లించలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

ఆదాయం కోల్పోయాం



చెరువు కింద ఉన్న పొలంలో ఏటా వరి, పత్తి సాగు చేసేవాళ్లం. చెరువును తొలగించడంతో ఏడాదికి దాదాపు రూ.3లక్షల ఆదాయం కోల్పోతున్నాం. వ్యవసాయంపై ఆధారపడి సాగు చేసిన పంటలు చేతికి రాక నష్టాల పాలవుతున్నాం.

– బోడ్డుపల్లి సత్యయ్య, గోకారం

పరిహారం అందించాలి



రిజర్వాయర్‌లో పొలం పోయిన ఈ ప్రాంతానికి నీరు వస్తుందనుకున్నాం. నేటికి 20 గుంటల భూమికి పరిహారం అందలేదు. రిజర్వాయర్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిపి రైతులకు నిరాశ్రయులుగా చేసి వ్యవసాయం చేయకుండా మిగిలాం. చేసేది ఏమీ లేక వలసబాట పడుతున్నాం. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించాలి.

– వెంకట్‌నారాయణ, గోకారం

మత్స్యకారులు ఉపాధి కరువు



గోకారం చెరువు ఏర్పాటు అయినప్పటి నుంచి గోకారం, చంద్రాయన్‌పల్లి చెరువులో చేపల పెంపకంతో ఉపాధి పొందేవాళ్లం. చెరువును తొలగించడంతో రెండు గ్రామాల మత్స్యకారులు దాదాపు 200 కుటుంబాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చేపలే పట్టేందుకు వలస వెళ్తున్నారు.

– సొప్పరి వెంకటయ్య, మత్స్యకార సంఘం అధ్యక్షుడు

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలోని గీత కార్మికులకు అండగా ప్రభుత్వం గీతన్న బీమా పథకాన్ని అమలులోకి తెచ్చిందని గీత కార్పొరేషన్ చైర్మన్ రవి కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని తర్నికల్‌లో పర్యటించారు. గ్రామంలో తాటిచెట్టు పై నుంచి పడి మృతిచెందిన కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రూ.25 వేల ఆర్థికసాయాన్ని కార్పొరేషన్ నుంచి అందజేశారు. ప్రమాదంలో చనిపోయిన గీత కార్మికులకు రూ.10 లక్షల ఆర్థికసాయం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కేసిఆర్ కార్యాచరణ సిద్ధం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, మున్సిపాల్ చైర్మన్ సత్యం, జనార్దన్‌రెడ్డి, గోవర్దన్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న రవికుమార్‌గౌడ్

హరితహోటల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



హోటల్ ప్రాంగణంలోని చెత్తను చూపుతున్న కట్టా శ్రీనివాసులు

కొల్లాపూర్: సోమశిల గ్రామంలోని హరితహోటల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని బీసీ సంక్షేమసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పర్యాటకశాఖ నిధులతో నిర్మించిన హరితహోటల్‌ను నిరుపయోగంగా ఉంచడం వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోటల్ ప్రాంగణం చెత్తకుప్పలకు, మద్యం సీసాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి, పర్యాటకులకు భోజన వసతులు అందేలా చూడాలని ఆయన కోరారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని చెంచు గ్రామాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డివిజన్ మలేరియా అధికారి అశోక్ ప్రసాద్ తెలిపారు. గురువారం మాచారం, మాచారం కాలనీ గ్రామాల్లో చెంచులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి వచ్చిన వారితో పాటు గ్రామస్తులకు వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దీపక్‌రాయ్, రాజీవ్, హరీష్‌గౌడ్, అఖిల్, ఐటీడీఏ అధికారి సేవ్యానాయక్ పాల్గొన్నారు.



చెంచు పెంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చదువు చాలా ముఖ్యం



జంగంరెడ్డిపల్లిలో విద్యార్థులతో ర్యాలీ

అమ్రాబాద్: చదువు చాలా ముఖ్యమని ఐదేళ్లు నిండిన ప్రతి ఒక్కరిని బడికి పంపించాలని కోనేరు సంస్థ సమన్వయకర్త బాలకృష్ణ తెలిపారు. మండలంలోని జంగంరెడ్డిపల్లిలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి వీధుల వెంట ర్యాలీ చేపట్టారు. పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, పిల్లలతో పని చేయించడం నేరమని వివరించారు.

పిల్లలను పాఠశాలలకు పంపాలి

లింగాల: మండల కేంద్రం, మండలంలోని ఎర్రపెంటలో గురువారం ఉపాధ్యాయులు ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించే పనులు చేపట్టారు.

తాడూరు: మండలంతోపాటు ఆయా గ్రామాలలోని బడిఈడు పిల్లలంతా బడిలో ఉండేవిధంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలను నాలుగు రోజుల నుంచి ఎంత మంది వరకు పాఠశాలలో నమోదు చేశారని పాఠశాల పరిసరాలు, ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూపరింటెండెంట్ రఘుకు వినతిపత్రం సమర్పించారు. దాదాపుగా 35ఏళ్ల నుంచి ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలను ఇవ్వాలని కోరారు. జీఓ నంబర్ 60ని అమలు చేయాలని, అదనపు సిబ్బందిని పెంచాలని తెలిపారు. 330 పడకలు ఉన్న ఆస్పత్రిలో చాలిచాలని సిబ్బందిని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బాలకిష్టమ్మ, రాధ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

తహసీల్దార్‌గా రవికుమార్ బాధ్యతలు

వెల్దండ: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ గురువారం బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. కలెక్టరేట్‌లో సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయినట్లు పేర్కొన్నారు.